బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కాసు ఆదిలక్ష్మి, కోటేశ్వరి

ఒంగోలు టౌన్: మాజీ ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ నేటి తరాలకు ఆదర్శనీయుడని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం జరిగిన బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట యోధుడిగా, అణగారిన వర్గాల నాయకుడిగా ఆయన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించారని చెప్పారు. దేశంలో దీర్ఘకాలం మంత్రిగా అధికారంలో ఉన్నారని, సమర్థుడైన పాలనాదక్షకుడిగా పేరొందారని తెలిపారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, సంపూర్ణమ్మ, కృష్ణవేణి, అనిల్‌బాబు, సందీప్, శాంసన్, లక్ష్మి, మృదుల్ కుమార్ పాల్గొన్నారు.



చీమకుర్తిలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

చీమకుర్తి: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం చీమకుర్తిలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పాటిబండ్ల జక్రయ్య ఆధ్వర్యంలో సంఘ నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత జాతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు జడ విజయ్, దుర్గారావు, కోటయ్య, సాల్మన్, దేవదాస్, స్థానికులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ఘన సన్మానం

ఒంగోలు మెట్రో: నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసిన మెడబలిమి సాంబశివరావు అభినందన సభ నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు మిడతల మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఘనంగా సన్మానించారు. పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా ఏమాత్రం గర్వం లేకుండా సమాజ సేవ చేస్తూ కళాకారుడిగా జీవించడం గొప్ప అనుభూతి అని కొనియాడారు. కళామిత్ర మండలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ వృత్తి రీత్యా ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే, ప్రవృత్తి రీత్యా కళారంగంలో పలు పాత్రల్లో నటిస్తూ రాణిస్తున్న సాంబశివరావు సేవలు మరువలేనివన్నారు. శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ దుర్యోధనుడిగా, శ్రీరామునిగా శ్రీకృష్ణుడుగా, భీమునిగా, బిల్వ మంగళుడుగా పలు రకాల పాత్రల్లో అద్భుతంగా నటించారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, చిటితోటి బాబూరావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, ఆదిపూడి నరేంద్ర కుమార్, దామవరపు ముసలయ్య, దేవరశెట్టి సింగయ్య, పెద్దిశెట్టి సుబ్బారావు, షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



సాంబశివరావును సన్మానిస్తున్న కళారంగ సభ్యులు

డెంగీ జ్వరాలతో జాగ్రత్త

ఒంగోలు టౌన్: ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మాధవిలత ఒక సంయుక్త ప్రకటనలో సూచించారు. దోమ కాటు వల్ల అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రతలతో వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. ఆకస్మికంగా వచ్చే జ్వరం, కండరాల నొప్పులు, కంటి లోపలి భాగంలో నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే డెంగీ సోకినట్లు అనుమానించాలని తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి ఆడ ఈడిస్ దోమ వలన వ్యాపిస్తుందని, దీనిపైన తెల్లటి చారలు ఉంటాయని వివరించారు. ఈ టైగర్ దోమ పగటిపూట మాత్రమే కుడతాయని, ఎక్కువ దూరం ఎగరలేవని తెలిపారు. మంచినీటిలో గుడ్లు పెట్టే ఈ దోమలు కుడితే కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం వస్తుందన్నారు. డెంగీ జ్వరాలు సాధారణంగా 80 శాతం దానికవే తగ్గిపోతాయని, హెమరేజిక్ జ్వరం, షాక్ సిండ్రోమ్ జ్వరాల్లో ప్లేట్‌లెట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. డెంగీ వ్యాధిని నిర్ధారించడానికి మొదటి వారంలో ర్యాపిడ్ పరీక్ష చేయడం, రెండో వారంలో ఎంఏసీ ఎలిసా పరీక్ష చేస్తారన్నారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి తగిన వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు.

రేపు దివంగత సీఎం వైఎస్సార్ జయంతి

మద్దిపాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మండవ అప్పారావు, వాకా కోటిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున హాజరవుతారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలని ఒక ప్రకటనలో వారు కోరారు.

బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలి



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు తులసి, పద్మావతి

అల్లూరు (కొత్తపట్నం): గ్రామాన్ని బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు-1, 2 తులసి కుమారి, పద్మావతి అన్నారు. మండలంలో అల్లూరు ఎంపీపీ కుమ్మరిపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నూరు శాతం బడిఈడు పిల్లలను బడి చేర్పించాలన్నారు. బడిలో చేర్పించిన తరువాత ఆ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేయాలని సూచించారు. వారికి విద్య ప్రాముఖ్యత, పేదరికం గురించి వివరించాలన్నారు. దాతల సాయంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్సిళ్లు, పెన్నులను ఎంఈఓ పంపిణీ చేశారు.

విద్యా ప్రవేశ కార్యక్రమాలపై సమీక్ష



హోమ్ బేస్డ్ విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

నాగులుప్పలపాడు: జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యా ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ తెలిపారు. శనివారం నాగులుప్పలపాడు ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించి సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దీక్ష యాప్ ద్వారా విద్యా ప్రవేశంలో లాగిన్ అవ్వాలని, రెండో దశ విద్యా ప్రవేశం కృత్యాలు, వంద శాతం నమోదు కోసం చేపట్టిన కార్యక్రమాల ఫొటోలు, పత్రాలు యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం ఉప్పుగుండూరు గ్రామంలో దివ్యాంగులైన విద్యార్థులకు సహిత విద్య ఉపాధ్యాయులచే నిర్వహించబడుతున్న హోమ్ బేస్డ్ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉద్యోగ సంఘ నేతలు



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘ నేతలు శనివారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, మసూద్ ఆలీ, కోశాధికారి భాను, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తాలూకా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, అక్బర్ బాష పాల్గొన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు చేసిన షెడ్డు మిత్ర

మద్దిపాడు: తనకు 8 నెలలుగా జీతం ఇవ్వకుండా దొడ్డవరం సర్పంచ్ సుబ్బారావు ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ దొడ్డవరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ మిత్ర ఎం.సురేష్ శనివారం ఈఓపీఆర్‌డీకి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో పలువురికి శుక్రవారం జీతాలు పెట్టి తనకు మాత్రం జీతం పెట్టనంటూ వ్యక్తిగతంగా తనను లక్ష్యంగా చేశాడని ఆరోపించారు. దిక్కున్న చోట చెప్పుకోమంటూ ఈసడించడమే కాకుండా వ్యక్తిగతంగా దూషించాడని తెలిపారు. దీనిపై కార్యదర్శిని ఈఓపీఆర్‌డీ రఘుబాబు వివరణ కోరగా, తాను జీతం పెట్టానని, కానీ జీతం ఇవ్వడానికి సర్పంచ్ ఒప్పుకోవడం లేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. షెడ్‌మిత్ర ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఈఓపీఆర్‌డీ తెలిపారు.



ఈఓపీఆర్‌డీకి ఫిర్యాదు చేస్తున్న షెడ్డు మిత్ర

స్పృహలోకి వచ్చిన డేనియల్

ఒంగోలు టౌన్: మూడు రోజులుగా అపస్మారకస్థితిలో చికిత్స తీసుకుంటున్న డేనియల్ శనివారం స్పృహలోకి వచ్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని బలరాం కాలనీకి చెందిన కాకర్లమూడి డేనియల్ భార్యతో విభేదాలతో ఒంటరిగా జీవిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ఒక మహిళతో సన్నిహితంగా మెలుగుతున్నాడు. అయితే ఈ నెల 3వ తేది రాత్రి అతడు సదరు మహిళ ఇంటికి వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు కానీ 4వ తేదీ తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో సదరు మహిళ ఇంటి బయట అపస్మారక పరిస్థితిలో పడి ఉండగా సమాచారం తెలుసుకున్న అతడి స్నేహితుడు గౌస్ బాషా జీజీహెచ్‌కు తరలించాడు. డేనియల్ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు చెప్పడంతో వెంటనే రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన బలరాం కాలనీలో సంచలనం సృష్టించింది. డేనియల్ మెడ మీద గాయం కనిపిస్తుండడంతో హత్యాప్రయత్నం జరిగినట్లు భావిస్తున్నారు. అయితే డేనియల్ స్పృహలో లేకపోవడంతో పోలీసులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్నారు. అతడిని ఆసుపత్రిలో చేర్పించిన గౌస్‌భాష, సన్నిహితంగా మెలుగుతున్న మహిళను శనివారం ఏఎస్పీ, డీఎస్పీ విచారించారు. ఇపుడు డేనియల్ స్పృహలోకి రావడంతో పోలీసులు విచారణ ముందుకు కదులుతుందని భావిస్తున్నారు. డేనియల్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి

చీమకుర్తి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బూచేపల్లి కల్యాణ మండపం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించే నివాళుల కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

బ్రాంచి ఎంపికే భవిష్యత్‌కు తొలిమెట్టు

ఒంగోలు: బ్రాంచి ఎంపికే భవిష్యత్‌కు తొలిమెట్టు అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. స్థానిక ఏ1 ఫంక్షన్‌హాలులో శనివారం జరిగిన బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థుల కోసం ఏటా ఇటువంటి ఫెయిర్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. రిటైర్డ్ డీజీపీ కేఆర్ఎం కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా చదవడం వల్ల కుటుంబానికే కాకుండా దేశానికి కూడా సేవ చేస్తున్నట్లు అవుతుందన్నారు. బ్రిలియంట్ అధినేత డాక్టర్ షేక్ న్యామతుల్లాబాషా మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం లక్కీ డిప్ ద్వారా ఇద్దరు విజేతలను ఎంపిక చేసి ల్యాప్‌టాప్‌లను అందజేశారు. బ్రిలియంట్ కంప్యూటర్స్ ఎండీ డాక్టర్ తాహేరా, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు, శ్రీహర్షిణీ విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, నాగార్జున డిగ్రీ కాలేజీ చైర్మన్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

దాతల సహకారం ఎంతో కీలకం



క్రీడా పరికరాలు అందిస్తున్న దాతలు

నాగులుప్పలపాడు: గ్రంథాలయాల మనుగడలో దాతల సహకారం చాలా కీలకమైనదని మండలంలోని ఉప్పుగుండూరు గ్రంథాలయం పాలకులు ప్రసాద్ అన్నారు. స్టార్ స్టూడియో వ్యవస్థాపకుడు కె.రామిరెడ్డి జ్ఞాపకార్థం నేషనల్ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత యుగంధర్ ఉప్పుగుండూరు గ్రంథాలయానికి అవసరమైన క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్, పాలపర్తి జయకర్‌బాబు, పులకణం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో వానరాలు

పుల్లలచెరువు: మండల కేంద్రంలో రోజురోజుకూ కోతుల బెడద అధికం అవుతోంది. కోతులు ఏకంగా ఇళ్లలోకి , పాఠశాలల్లోకి వెళ్లి ప్రజలను, విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పిల్లలు, ఆడవారు బయటకు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. కోతులు మనుషుల మీదకు ఎగబడి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి కోతులను దూరంగా తరలించాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.